మురికి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

బొడ్రాయిబజార్, జూలై 1 : ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకొని, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో సోమవారం దోమల లార్వా నివారణకు మురికి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేసి మాట్లాడారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ సురేశ్, బీఆర్‌ఎస్ నాయకులు బొడ్డు దుర్గయ్య, మచ్చ రాము, జవాన్ ఖమ్రుద్దీన్, శానిటేషన్ సిబ్బంది, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూలై 1 : ప్రజావాణిలో బాధితుల నుంచి వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డివిజన్, మండల స్థాయిలో ప్రజలు వివిధ సమస్యలపై చేసుకున్న దరఖాస్తుల్లో పరిష్కారం కాని వాటిని సంబంధిత దరఖాస్తుదారుడికి ఎందుకు చేయలేకపోయామో వివరాలు తెలుపాలన్నారు. వానకాలం సీజన్ మొదలైనందున వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం రైతులకు అదుబాటులో ఉండాలని సూచించారు. 107 మంది వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకోగా అత్యధికంగా రెవెన్యూ శాఖకు 67, డీపీఓ 6, ఇరిగేషన్ 5, ఇతర శాఖలకు మిగతా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ సతీశ్‌కుమార్, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించాలని ప్రజావాణిలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు దరాఖాస్తు అందిస్తున్న దివ్యాంగురాలు పద్మ

ఆర్థికసాయం ఇప్పించండి..

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట శివారులో ఎస్సారెస్పీ కాల్వ కింద భూములు కోల్పోయిన రైతులకు ఆర్థిక సాయం అందించాలని ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. రైతులు యారాల రాంరెడ్డి, ఆకుల వెంకటయ్య, పూలమ్మ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎస్సీలకే 'మీసేవ' కేటాయించాలని వినతి

చిలుకూరు : మండలంలోని గ్రామాల్లో కొత్త మీసేవా కేంద్రాలను సీఎస్సీ కేంద్రాలకే ఇవ్వాలని జిల్లాలోని సీఎస్సీ నిర్వాహకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తాడూరి లింగయ్య, కాసాని గోపి, భూక్యా ఉపేందర్, బెల్లంకొండ లక్ష్మణ్, మట్టపల్లి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

కస్తూర్బాలో నాణ్యమైన విద్యను అందించాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

మద్దిరాల, జూలై 1 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలో రూ.4.43 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని, విద్యార్థినులకు జాగ్రత్తతో, ఒత్తిడిలేని విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి, తాసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీటీసీలు మార్త అనితకృష్ణమూర్తి, ముక్కాల అవిలమల్లు, ఎంఈఓ రాములునాయక్, ఎస్ఓ తేజశ్రీ, నాయకులు గుడ్ల వెంకన్న, రేట్నేని శ్రీనివాస్, పచ్చిపాల వెంకన్న, చామకూరి శ్రీనివాస్, పాక అమృత మల్లు, వల్లపు రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

నాగారం : మండల పరిధిలోని పసునూరు గ్రామానికి చెందిన మల్లెపాక శ్రీను కుమార్తె సాయిశ్రీజకు పై చదువుల నిమిత్తం సోమవారం ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట నాయకులు తొడుసు లింగయ్య, సుంకరి జనార్దన్, ఎంపీటీసీ ఏపూరి మంజుల, శ్రీనివాస్, వెంకన్న, యాదగిరి తదితరులున్నారు.

మత్తు పదార్థాలు విక్రయించొద్దు : సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, జూలై 1 : గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు హెచ్చరించారు. సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి కేసులతో సంబంధం ఉన్న పాత నేరస్తులకు కొత్త చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య పాల్గొన్నారు.

పాత నేరస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చరమందరాజు

బురదమయంగా ఎర్రవరం ప్రధాన రోడ్డు

కోదాడ రూరల్, జూలై 1 : మండల పరిధిలోని ఎర్రవరం బాల ఉగ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణం బురదమయమైంది. వర్షాలు పడడంతో రోడ్డంతా చిత్తడిగా మారి భక్తులు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆలయం దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందడంతో భక్తులు వేలల్లో వస్తున్నారు. ఆయల కమిటీ స్పందించి రోడ్డు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

బురదమయంగా ఎర్రవరం ఆలయ ప్రధాన రహదారి

3న మంత్రి ఉత్తమ్ పర్యటన

నేరేడుచర్ల, జూలై 1 : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఈనెల 3న భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ

నేరేడుచర్ల, జూలై 1 : ఇండియన్ పీనల్ కోడ్ నూతనంగా తీసుకొచ్చిన మూడు చట్టాలపై పోలీస్ సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ నాయక్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో చట్టాల్లో పొందుపర్చిన ప్రధాన అంశాలను వివరించారు. భారతీయ న్యాయ సమితి 2023 చట్టంలో చైన్ స్నాచింగ్ సెక్షన్, ఆర్గనైజ్డ్ క్రైమ్, టెర్రరిస్ట్ యాక్ట్ ఈ చట్ట పరిధిలోకి వచ్చాయన్నారు. అదే విధంగా భారతీయ నాగరికత సురక్ష సంహిత చట్టం 2023లో 60 సంవత్సరాలు దాటిన మహిళ, పురుషుల నేరారోపణపై అరెస్టు చేయాల్సి వస్తే డీఎస్పీ అనుమతి ఉండాలన్నారు. 7 సంవత్సరాలు పైబడి శిక్ష పడే కేసుల్లో ఖచ్చితంగా ఆడియో, వీడియో రికార్డులు నమోదు చేయాలన్నారు. మరో కొత్త చట్టం భరతీయ సాక్ష్య అధినీయం 2023లో ఎల్రక్టానిక్ పరికరాల సాక్ష్యం ప్రైమరీ ఎవిడెన్స్‌గా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఈ చట్టాలపై ప్రజా వేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

యూనిఫామ్ పంపిణీ

హుజూర్‌నగర్, జూలై1 : పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కౌన్సిలర్ గాయత్రి భాస్కర్ సోమవారం యూనిఫామ్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు లతిఫ్, ఉపాధ్యాయులు జయప్రద పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తున్న వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి

రైతు భరోసా అందించాలి : సీపీఎం

పాలకవీడు, జూలై 1 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే రైతు భరోసా అందించాలని సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. నాయకులు నరసింహ, మట్టేశ్, సైదయ్య, ధనమూర్తి, పురుషోత్తంరెడ్డి, ఏసురత్నం, మల్లారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల వైద్యాధికారిని సన్మానిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఘనంగా డాక్టర్స్ డే

కోదాడ టౌన్/ తిరుమలగిరి/ హుజూర్‌నగర్ రూరల్/ నేరేడుచర్ల జూలై 1 : డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం పలుచోట్ల వైద్యులను సన్మానించారు. తిరుమలగిరి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి మల్లెల వందనను సన్మానించి, కేక్ కట్ చేయించారు. సీహెచ్ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ స్వరూపకుమారి, సుభద్ర, నర్సింహారెడ్డి తేజస్ ఉన్నారు.

హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరిలో మండల వైద్యాధికారి పుష్పలతను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పద్మ, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కోదాడ పట్టణంలోని వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, డాక్టర్ ఏటుకూరి రామారావులను ఎస్ఆర్ఎం పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి ఆధ్వర్యంలో సన్మానించారు. నేరేడుచర్ల, పెంచికల్‌దిన్న పీహెచ్‌సీ డాక్టర్లు నాగిని, సౌమ్యశ్రీ, సీతామహాలక్ష్మి, శృతి, స్థానిక వైద్యులు ధర్మతేజ, సాయి, స్వప్న, చార్టెడ్ అకౌంటెంట్ సాయి, వనితను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జిలకర రామస్వామి, జిల్లా చైర్మన్ బట్టు మధు, జోనల్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, వాసవి క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, జోన్ చైర్మన్లు కొత్త లక్ష్మణ వీరవల్లి శ్రీలత, వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితలున్నారు.

సోమప్ప ఆలయానికి నాగభరణం బహూకరణ

నేరేడుచర్ల, జూలై 1 : మండలంలోని సోమప్ప సోమేశ్వరాలయానికి సోమవారం పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన నెలమారు శ్రీనివాస్‌రెడ్డి తన సోదరులతో కలిసి నాగభరణం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరు సత్యనారాయణ, పూజారి శ్రీనివాస శాస్త్రి, వైస్ చైర్మన్ లక్ష్మయ్య, సోములు, సైదులు, బాలమణి, వెంకట్, రాములు, బాస్కర్ తదితరులున్నారు.

పాఠశాలలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

మేళ్లచెర్వు, జూలై 1 : మండల పరిధిలోని రామాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మండల పరిషత్ నిధుల నుంచి మంజూరైన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, ఉపాధ్యాయులు, నాయకులు రంగిశెట్టి సైదయ్య, వెంకయ్య, మాధవరావు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మాసైదేశ్వర్‌రావు

బీసీ కులగణన చేయాలి : శంకర్ యాదవ్

నూతనకల్, జూలై 1: బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కాస శంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం బీసీ సంక్షేమ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట నాయకులు ఏడుకొండలు, రాఘవేంద్ర, రాజేశ్, లింగస్వామి, జానకిరాములు, హనుమంతు ఉన్నారు.

పీహెచ్‌సీలో స్వచ్ఛభారత్

నూతనకల్, జూలై 1: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి పాల్గొని పరిసరాలు పీహెచ్‌సీ శుభ్రం చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు తారమ్మ, మాణిక్యమ్మ, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, అనుముల రవీందర్, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

తాగునీరు అందించాలి : సీపీఐ

గరిడేపల్లి, జూలై 1 : గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో ఎడ్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

'కొత్త చట్టాలను రద్దు చేయాలి'

నేరేడుచర్ల, జూలై 1 : కేంద్ర ప్రభుతం న్యాయ వ్యవస్థలో తీసుకొచ్చిన మూడు కొత్త చట్టాలను రద్దు చేయాలని, లేదంటే మార్పులు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాస పల్లయ్య అన్నారు. స్థానిక చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేసి ఆయన మాట్లాడారు. ఇంగ్లీష్ చట్టాల పేరుతో భారతదేశంలోని న్యాయవ్యవస్థలో ఉన్న చట్టాలను తొలగించి వాటి స్థానంలో మూడు కొత్త చట్టాలను తెచ్చి న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. కార్యక్రమంలోనాయకులు ఎర్రమల శ్రీను, పీఓడబ్ల్యూ నియోజకవర్గ అధ్యక్షురాలు లక్ష్మి, శ్యామల ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకులు వాస కరుణాకర్, నాయకులు భిక్షం, దేవయ్య, ఆనంద్, నర్సమ్మ, లక్ష్మమ్మ, దుర్గమ్మ, రంగయ్య, దేవయ్య ఉన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎంపీడీఓ

చిలుకూరు, జూలై 1 : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. చిలుకూరులో వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహీం, టీపీ స్రవంతి, గ్రామ కార్యదర్శి షరీఫుద్దీన్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం పాల సంఘం చైర్మన్‌గా బిక్కి శ్రీను

నాగారం, జూలై 1 : మదర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా మండల పరిధిలోని పసునూరు గ్రామానికి చెందిన బిక్కి శ్రీను విజయం సాధించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఈ ఎన్నికల్లో సంఘం డైరెక్టర్లుగా సోమిరెడ్డి సోమయ్య, సభ్యులుగా ఉట్కూరి గోపి, నరాల అశోక్, మల్లెపాక వెంకటమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంపెల్లి శ్రీను, కె.సోమయ్య, ఉపేందర్, శివ పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌కు మైక్రోస్కోప్ బహూకరణ

గరిడేపల్లి, జూలై 1 : మండలంలోని కీతవారిగూడెం జడ్పీహెచ్‌ఎస్‌కు 2003 – 4వ సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.5 వేల విలువ గల మైక్రోస్కోప్‌ను సోమవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సువర్ణ, సైన్స్ ఉపాధ్యాయులు డి.నర్సిరెడ్డి, సీహెచ్.శేఖర్, ప్రసాద్, నాటి విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ కంటి ఆసుపత్రిలో మెరుగైన సేవలు

- చైర్మన్ దోసపాటి గోపాల్

బొడ్రాయిబజార్, జూలై 1 : లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం దవాఖానలో మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి అనంతరం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. గతంలో వారంలో రెండ్రోజులు మాత్రమే ఆపరేషన్లు జరిగేవని ఇక నుంచి ప్రతిరోజు ఆపరేషన్లు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సెక్రటరి ఉప్పల రాజేంద్రప్రసాద్, కోశాధికారి చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నూకల వెంకట్‌రెడ్డి, గుడిపుడి వెంకటేశ్వర్‌రావు, జాయింట్ సెక్రటరీ ఈగ దయాకర్‌గుప్తా, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ పటేల్ నర్సింహారెడ్డి, పీఆర్ఓ రాచర్ల కమలాకర్, ఈసీ సభ్యులు తోట శ్యాంప్రసాద్, పెండెం చంద్రశేఖర్, పోలెబోయిన నర్సయ్యాయాదవ్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న లయన్స్ కంటి ఆసుపత్రి నూతన కార్యవర్గం

భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

మోతె, జూలై 1 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మంద ఉపేందర్ కుటుంబానికి సోమవారం ఆ సంఘం తరపున రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. సంఘం మండలాధ్యక్షుడు ఒగ్గు సైదులు మాట్లాడుతూ తోటి కార్మికుడు అకాల మృతితో కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ దోసపాటి శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ఉపాధ్యాక్షుడు గట్టు శ్రీనివాస్, మండలాధ్యక్షుడు నార్ల రంగయ్య పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

మఠంపల్లి, జూలై 1 : మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, తెలుగు పండిట్ సోమయాజుల లక్ష్మీనరసింహమూర్తి (86) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన పలు ఆలయాల్లో వ్యాఖ్యాతగా వ్యవహరించి విలువైన సందేశాలను భక్తులకు తెలియజేశారు. ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన సోమయాజులు మృతి గురించి తెలుసుకున్న విద్యార్థులు ఆయనకు నివాళి అర్పించారు.

గ్రంథాలయ చైర్మన్‌గా హనుమారెడ్డి

చింతలపాలెం, జూలై 1 : మండలంలోని దొండ పహాడ్ గ్రంథాలయ చైర్మన్‌గా గ్రామానికి చెందిన వి.హనుమారెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం గ్రంథాలయ కమిటీని ఎన్నుకోగా ఉపాధ్యక్షుడిగా దాసరి కరుణాకర్, కార్యదర్శిగా బత్తుల జోజప్ప, ట్రెజరర్‌గా కుంటిగొర్ల సైదులు, డైరెక్టర్లుగా పి.నరసింహరెడ్డి, శివ, రవికుమార్, గురుసాయి, నాగవేను, సాయి, గోపి ఎన్నికయ్యారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

నేరేడుచర్ల, జూలై 1 : మండలంలోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో సోమవారం నేరేడుచర్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుభరోసా పథకం అమలు విధివిధానాలపై సంఘం సభ్యులు, రైతులతో ఏడీఏ సంధ్యారాణి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా పథకం 10 ఏకరాల సాగు భూమి కలిగిన రైతులకే వర్తించాలని ఎక్కవ మొత్తంలో రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ కొప్పుల రాంరెడ్డి, డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శంకరాచారి, వెంకన్న, ఏఓ జావిద్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ, ఏఈఓ నాగరాజు, సీఈఓ శ్రీనివాస్, స్టాఫ్ అసిస్టెంట్ రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసా అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ సంధ్యారాణి

అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు అందించాలి : రాజు

కోదాడ టౌన్, జూలై 1: అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు అన్నారు. ఈ సందర్భంగా కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఉపాధి కూలీల వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదని, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సు నడుపడంతో పాటు కరెంటు కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కోరారు. ఆయన వెంట బి. వసరం, సూర్యం ఉన్నారు.

ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రికార్డులను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ జగదీశ్‌కుమార్

నిధుల దుర్వినియోగంపై విచారణ

చింతలపాలెం, జూలై 1 : మండల పరిధిలోని గాంధీనగర్‌తండా గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపణలు రావడంతో ఇన్‌చార్జి ఎంపీడీఓ జగదీశ్ కుమార్ సోమవారం రికార్డులను విచారణ నిమిత్తం తీసుకుళ్లారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ అరుణ, పంచాయతీ కార్యదర్శి అనిత కుమారి, నాగరాజు గ్రామస్తులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- రూ.25వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నేరేడుచర్ల, జూలై 1 : దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రూ. 25వేల నగదుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవీందర్ నాయక్ సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. పట్టణ పరిధిలోని పాత ఇనుము షాపులో జూన్ 29న జరిగిన దొంగతనానికి సంబంధించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సీతారాంపురంలో నివాసముంటున్న హైదరాబాద్‌కు చెందిన తాళ్లూరి కనకాచారి(34) పట్టుబడ్డాడు. నేరేడుచర్లలో వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగిలించిన ద్విచక్ర వాహనంతో వస్తున్న కనకాచారి అనుమానస్పదంగా కనిపించాడు. విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకొని హుజూర్‌నగర్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇతడిపై సరూర్‌నగర్, మిర్యాలగూడ వన్‌టౌన్ స్టేషన్‌లలో కేసులు ఉన్నట్లు తెలిపారు.

నిందితుడి వివరాలు తెలుపుతున్న ఎస్ఐ రవీందర్ నాయక్

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నరేశ్(ఫైల్)

గరిడేపల్లి, జూలై 1 : మండల కేంద్రంలో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గరిడేపల్లి ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పెండెం నరేశ్(40)కు అదే మండలానికి చెందిన స్వప్నతో 12 ఏండ్ల క్రితం వివాహమైంది. ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో గత కొన్నేండ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో భార్య జూన్ 19న తల్లిదండ్రులు సైదులు, అంజమ్మతో కలిసి భర్త ఇంటికి వెళ్లి విడాకుల నోటీస్‌పై సంతకం పెట్టాలని కోరింది. నరేశ్ ఒప్పుకోకపోడంతో ముగ్గురు కలిసి అతడి మీద దాడి చేయగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అవమానాన్ని తట్టుకోలేక ఆదివారం రాత్రి గ్రామ శివారులో మామిడి చెట్టుకు మోటార్ కేబుల్ వైర్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరేశ్ తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

హుజూర్‌నగర్, జూలై 1 : మండలంలోని రాయినిగూడెంలో విద్యుదాఘాతంతో సోమవారం వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన ఉల్వాలపురి నరసింహారావు (40) భవన నిర్మాణ, మార్బుల్ కార్మికుడిగా పనిచేస్తుంటాడు. గత నెల 29న హుజూర్‌నగర్‌లోని చింతకాయల కోటయ్య ఇంట్లో బండలను పాలిష్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ హ్యాండిల్‌కు కరెంట్ పాస్ అయ్యి షాక్ తగిలింది. తీవ్ర గాయాల పాలైన నరసింహారావును హుజూర్‌నగర్ ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో సూర్యాపేట జనరల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

వికాస్ కళాశాలలో ఫేర్‌వెల్ డే

సూర్యాపేట రూరల్, జూలై 1 : పట్టణ పరిధిలోని రాయిన్‌గూడెం సమీపంలో గల వికాస్ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు సోమవారం ఫేర్‌వెల్ డేను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాలుగేండ్లలో సాధించిన విజయాలు, మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల ఆట, పాటలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె. రామదాసు, ప్రిన్స్‌పాల్ ఆడెపు రమేశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్మన్ కె. రామదాసు